క్లుప్తంగా

పశు వధ నేరం..



వ్యాపారులకు సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: పశువులను వధించినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్, కలెక్టరేట్, పరిసర ప్రాంతాల్లో ఉన్న పశుమాంసం అమ్మే వ్యాపారస్తులతో శనివారం సమావేశం నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్‌తో పాటు అన్ని పర్మిషన్లు ఉన్న వారు మాత్రమే పశుమాంసం విక్రయించాలని, ఎలాంటి అనుమతులు లేకుండా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

నెలాఖరులోగా లైసెన్స్ రుసుం చెల్లించాలి

విజయనగరం: నగర పరిధిలో ఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్ రుసుములు చెల్లించాలని, లేనిపక్షంలో మార్చి ఒకటో తేదీ నుంచి అపరాధ రుసుం విధించనున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ట్రేడ్ లైసెన్స్ రుసుములు తమ సచివాలయ పరిధిలో ఉన్న కార్యదర్శిని నేరుగా కలిసి చెల్లించాలన్నారు. అనధికారి వ్యక్తులు, ఇతరులకు ఫోన్ పే ద్వారా గాని, గూగుల్ పే ద్వారా గాని రుసుములు చెల్లించవద్దని స్పష్టం చేశారు. అలాగే రుసుం స్వీకరించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

డీ వార్మింగ్ డే రేపు

విజయనగరం: ఈ నెల పదో తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినం (డీ వార్మింగ్ డే) సందర్భంగా 19 ఏళ్ల లోపున్న పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 19 ఏళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్కరికీ మాత్రలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అనంతరం అరగంట తర్వాత విద్యార్థులచే మాత్రలు మింగించాలని సూచించారు.

నేర ప్రవృత్తి విడనాడాలి

విజయనగరం క్రైమ్: రౌడీషీట్ కలిగిన వ్యక్తులు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తన అలవరుచుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. స్టేషన్ ఆవరణలో రౌడీషీట్ నమోదైన వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతాన్ని మరిచి భవిష్యత్‌లో మంచి నడవడికతో జీవితాన్ని సాగించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో మంత్రి కొండపల్లి



మంత్రి కొండపల్లికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం దర్శించుకున్నారు. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి తిరుక్కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వై. శ్రీనివాసరావు, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, నల్లం శ్రీనివాసరావు, బొంతు వెంకటరమణ, రాజప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం

- ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ కొయ్యాన అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జ్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నెట్‌వర్క్ ఆస్పత్రుల మెడికోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోగుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. సమావేశంలో మేనేజర్ రాంబాబు, టీమ్‌లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భానుప్రసాద్, ఆర్. మత్యాలనాయుడు, దేవి, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడిపై చిన్నచూపేలా...?

- జీర్ణావస్థకు చేరుకున్న కోనాడ దేవాలయం
- ఎనిమిది నెలల కిందట కోటి రుపాయలు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- ఆలయ నిర్మాణ పనులపై నీలినీడలు
- దేవదాయశాఖ నిర్లక్ష్యంతో నేటికీ టెండర్ దశ దాటని వైనం
- పది రోజుల కిందట కూలిన ధ్వజస్తంభం
- ఆందోళనలో భక్తులు



జీర్ణావస్థకు చేరుకున్న కోనాడ దేవాలయం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ దేవాలయం నూతన నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎనిమిది నెలల కిందట అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆలయం నిర్మాణాలకు కోటి రుపాయలను మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంతో కాలంగా నిధుల మంజూరు కోసం గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కృషి చేశారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తల సహకారంతో సుమారు 25 లక్షల రుపాయల మ్యాచింగ్ గ్రాంట్ దేవదాయశాఖ అకౌంట్‌కు జమ చేశారు. మ్యాచింగ్ గ్రాంట్ జమ చేసిన తర్వాత ప్రభుత్వం ఆలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అయితే టెక్నికల్ అనుమతులు మంజూరు కాకపోవడంతో ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. కోనాడ గ్రామంలో ఉన్న అతిపురాతన వేణుగోపాలస్వామి, మణిరామలింగేశ్వర స్వామి, ఉమారామలింగేశ్వర దేవస్థానాలు ఉత్తరాంధ్రలోనే అతి పురాతనమైనవి. ప్రస్తుతం ఈ ఆలయాలు జీర్ణావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు పడిపోతాయోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల కిందట దేవాలయంలో ఉన్న ధ్వజస్తంభం కూలిపోయింది. పురాతన దేవాలయం కావడంతో ఎప్పటికప్పుడు గోపురం, మండపాల పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో భక్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి నిర్మాణాలకు నిధులు మంజూరైనప్పటికీ పనులెందుకు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే దేవాలయాల అభివృద్ధి, అన్యాక్రాంతమైన దేవాలయ భూములపై ఎమ్మెల్యేతో పాటు అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఆలయ అర్చకులు, దేవస్థానం అధికారులు, వంశ పారంపర్య ధర్మకర్తలతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి దేవస్థానం అభివృద్ధి చర్చించే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోనాడ దేవాలయాల నిర్మాణాల కోసం నిధులు మంజూరుకు అలుపెరగని పోరాటం చేసి సఫలకృతులయ్యారు. నిధులు మంజూరైన తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో నిర్మాణాల ప్రక్రియ టెండర్ దశలోనే ఆగిపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు స్పందించి పురాతన కోనాడ దేవాలయంలో నిర్మాణాలు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



కూలిన ధ్వజస్తంభం

పనులు చేపట్టాలి..

దేవాలయాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలి. నిర్మాణాలకు సంబంధించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ. 25 లక్షలు ఇప్పటికే జమచేశాం. ప్రభుత్వం కూడా కోటి రూపాయలు మంజూరు చేసింది. సాంకేతిక అనుమతులు సాధించి పనులు చేపట్టాలి.

– వాడ్రేవు నాగరాజుశర్మ, ఆలయ అర్చకుడు, కోనాడ దేవస్థానం.

ఆహారన్వేషణ..



దైనందిన జీవితంలో ప్రతి జీవీ ఆహారాన్ని సమకూర్చుకోవాలి.. కొన్నిసార్లు ఆహారం కోసం చాలా పోరాటమే చేయాల్సి ఉంటుంది.. మరి కొన్నిసార్లు మాత్రం సులువుగానే దొరుకుతుంది.. డెంకాడ రోడ్డులో ఓ రైతు ట్రాక్టర్‌తో శనివారం పొలం దున్నడంతో భూమిలో ఉన్న క్రిమికీటకాలు, పురుగులు, ఆహార ధాన్యాలు బయటపడడతో ఒక్కసారిగా వందలాది కొంగలు చేరుకుని తమ కడుపు నింపుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన ఒకరి నుంచి తొమ్మిది మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ వి. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో గడిచిన మూడు నెలల్లో 45 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 475 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికార మద్యం షాపులలో పట్టుబడిన 33 మందిని సంబంధిత తహసీల్దార్ వద్ద లక్ష రుపాయల పూచికత్తుతో బైండోవర్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై ఎన్.సురేష్, సిబ్బంది రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



పట్టుకున్న మద్యంసీసాలతో సీఐ రవికుమార్, తదితరులు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లిమర్ల: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ స్కూల్స్ ఏర్పాటు కోసం చేపడుతున్న కసరత్తులో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్నచోట మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చాలని.. మిగిలిన ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు 12వ పీఆర్సీ కమిషన్‌కు చైర్మన్‌ను నియమించాలన్నారు. పీడీఎఫ్ తరపున ఎమ్మెల్సీ బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు పతివాడ త్రినాథ్, మద్దిల రాజు, హరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన యూటీఎఫ్ ప్రతినిధులు

వెట్టిచాకిరీ నిర్మూలన అందరి బాధ్యత

- కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: వెట్టిచాకిరి నిర్మూలన అందరి బాధ్యతని కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు అన్నారు. బాండెడ్ లేబర్ సిస్టమ్ యబాల్షన్ డే సందర్భంగా నేచర్ సంస్థ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నేటికీ వెట్టిచాకిరి ఉందన్నారు. కర్మాగారాలు, బేకరీలు, బిల్డింగ్ వర్క్స్, తదితర ప్రదేశాల్లో తక్కువ వేతనం ఇచ్చి ఎక్కువ పని చేయించుకుంటున్నారని చెప్పారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, నేచర్ సంస్థ ప్రతినిధులు కె. బంగారుబాబు, శేఖర్, కృష్ణారావు, చైతన్య, చైల్డ్‌లైన్ ప్రతినిధి చప్ప అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ రీ సైక్లింగ్ యూనిట్ ప్రారంభం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ యూనిట్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నియంత్రించడం సంతోషదాయకమన్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్రెండ్స్ ఇండీడ్, సాయి కొరియన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా బయట పారవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో రీసైక్లింగ్ యూనిట్ ద్వారా టైల్స్, ప్రహరీగోడ పలకలు, పూలకుండీలు తయారు చేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, ఫ్రెండ్స్ ఇండీడ్ డైరెక్టర్ అన్నా లెగ్‌లాండ్, సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, వైస్ సర్పంచ్ లంకలపల్లి రాజారావు, ఎ.ప్రసాదరావు, బొల్లు రమేష్ , క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

వెట్టిచాకిరీ చేయిస్తే శిక్షార్హులు

శృంగవరపుకోట: ఎవరినైనా వెట్టిచాకిరీకి వినియోగిస్తే సంబంధిత వ్యక్తులు 1976 వెట్టి చాకిరీ నిర్మూలన చట్ట ప్రకారం శిక్షార్హులని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ సబ్బవరపు వాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 9న వెట్టిచాకిరీ నిర్మూలన దినం సగర్వంగా నిర్వహించుకునేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.1975 అక్టోబర్ 25 నుంచి వెట్టి చాకిరీ నిర్మూలన వ్యవస్థను భారతదేశంలో అమలు చేస్తున్నారని, 1976లో చట్టం చేశారని, ఈ చ ట్టం ద్వారా వెట్టి చాకిరీలో ఉన్న వ్యక్తులు స్వేచ్ఛా వాతారణంలో బతకడానికి అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు.వెట్టిచాకిరీతో అవస్థ పడుతున్న వారెవ్వరైనా ఉంటే మండల న్యాయ సేవా కమిటీని ఆశ్రయిస్తే వారికి ఉచితంగా న్యాయసహాయం అందించి, వెట్టిచాకిరీ నుంచి విముక్తులను చేస్తామని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



చిన్నారుల నృత్యం

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఫోర్ట్ సిటీ స్కూల్‌లో శనివారం జరిగిన 13వ వార్షికోత్సవంలో చిన్నారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. రెండురోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలను తొలుత పాఠశాల చైర్మన్ కేవీపీ రాజు(శివ) ప్రారంభించారు. తొలి రోజున నృత్యాలు, నాటికలు, యోగా, పిరమిడ్స్, తైక్వాండో, కోలాటం, తదితర కళాంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పోటు

- పంటను ఆశించిన కత్తెర పురుగు
- చీపురుపల్లి నియోజకవర్గంలో 14,010 ఎకరాల్లో రబీ మొక్కజొన్న సాగు
- ఇప్పటికే 20 శాతం విస్తీర్ణంలో తెగులు బారిన పంట
- పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్న కత్తెరపురుగు
- ఆందోళనలో రైతులు
- నష్టనివారణ, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

చీపురుపల్లి నియోజకవర్గంలో రబీ సీజన్ మొక్కజొన్న సాగు విస్తీర్ణం వివరాలు(ఎకరాల్లో)..

మండలం	సాధారణ విస్తీర్ణం	సాగు విస్తీర్ణం
మెరకముడిదాం	2,190	2,200
చీపురుపల్లి	4,690	4,580
గరివిడి	5,800	5,600
గుర్ల	2,065	1,630



గాదెలమర్రివలసలో కత్తెరపురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)



కత్తెరపురుగు ఆశించడంతో మొక్కజొన్న ఆకులపై ఏర్పడిన రంధ్రాలు

మెరకముడిదాం: చీపురుపల్లి నియోజకవర్గంలో రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులను కత్తెర పురుగు కలవరపెడు తోంది. పంట దిగుబడికి కత్తెర వేసేలా తెగులు ఉధృతంగా వ్యాప్తి చెందుతుండ డంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట తొలినాళ్లలోనే పురుగు ఆశించిందని, తమ ఆశలను కత్తెరపురుగు అడియాశలు చేసేలా ఉందని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈపురు గును తొలిదశలోనే గుర్తించి నియంత్రించకపోతే నష్టం తప్పదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాల్లో రబీ మొక్కజొన్నసాగు సాధారణ విస్తీర్ణం 14,7 45 ఎకరాలు కాగా, ఈఏడాది సుమారు 14,010 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట కొన్నిచోట్ల 20 రోజుల నుంచి 40 రోజుల దశలో ఉంది. సాగువిస్తీర్ణంలో ఇప్పటికే సుమారు 20 శాతం పంటను కత్తెర పురుగు ఆశించింది.

ప్రారంభంలో నివారించకుంటే తీవ్రనష్టం

కత్తెర పురుగును ప్రారంభదశలో నివారించకుంటే పంటకు తీవ్రనష్టం తప్పదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. లద్దెపురుగు జాతికి చెందిన కత్తెరపురుగు జీవిత కాలం 60 రోజుల వరకు ఉంటుంది. విత్తనాలు విత్తిన వారం నుంచి పదిరోజుల తర్వాత వచ్చే మొలకలకు భూమిలో ఉన్న తల్లిపురుగులు ఆశిస్తాయి. మొక్కలపై గుంపులు గుంపులుగా గుడ్లు పెడుతుంటాయి. ఒక్కో గుంపులో 1,500 నుంచి 2వేల వరకు గుడ్లు పెడతాయి. గుడ్లు నుంచి బయటకు వచ్చిన పురుగులు మొక్క ఆకులను గోకి తింటుంటాయి. దీంతో ఆకులపై నిలువు గా రంధ్రాలు ఏర్పడతాయి. పురుగులు పెద్దవి అయిన తర్వాత మొవ్వలో చేరి లోపల కాండా న్ని తినేస్తాయి. మొవ్వును పూర్తిగా తినివేయడం వల్ల మొవ్వ కత్తిరించినట్టుగా కనిపిస్తుంది. పురుగు తిని విసర్జించిన మలపదార్థంతో మొవ్వు అంతానిండిపోతుంది. మొవ్వులో ఉన్న పూతకు కూడా నష్టాన్ని కలిగిస్తాయి. ఫలితంగా కండె తయారు కాదు.




యాడిక గ్రామసమీపంలో సాగులో ఉన్న మొక్కజొన్నపంట

యాజమాన్య పద్ధతులతో నియంత్రణ

సమగ్ర యాజమాన్య పద్ధతులతో కత్తెర పురుగును నివారించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎకరానికి ఎనిమిది నుంచి పది వరకు లింగాకర్షక బుట్టలను చేనులో ఏర్పాటు చేసుకోవాలి.లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేప నూనెను కలిపి పిచికారీ చేయడం వల్ల కత్తెర పురుగు గుడ్లు, మొదటి దశ లార్వాలను నాశనం చేయవచ్చు. తొలిదశలో పురుగు నివారణకు క్లోరిఫైరిపాస్ 20 శాతం ఈసీ 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రెండో దశ, మూడో దశలో ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పురుగును అరికట్టడానికి లీటరు నీటికి ఇమామెక్టిన్ బెంజోయెట్ 5 శాతం ఎస్‌జీ మందును మిల్లీ లీటరు కలిపి ఎకరానికి 80 గ్రాముల మందును పిచికారీ చేయాలి. నాలుగు, అయిదో దశల్లో పురుగుల నివారణకు విషపు ఎరను వాడాలి. విషపు ఎరను సొంతంగా తయారు చేసుకోవాలి. రెండు కిలోల బెల్లం, పది కిలోల తవుడు మిశ్రమానికి రెండు లీటర్ల నీటిని కలిపి 24 గంటలపాటు పులియనివ్వాలి. ఈ మిశ్రమా న్ని పంటపొలంలో వాడడానికి అరగంట ముందు దానికి వంద గ్రాముల లథయోడికర్బ్ అనే మందును కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసుకుని మొక్క సుడి భాగాల్లో వేయాలి.


పెట్టుబడి పెరిగిపోతోంది...



ఒకప్పుడు మొక్కజొన్న పంట సాగుకు తక్కువ పెట్టుబడి అయ్యేది. దుక్కులు, విత్తనాల ఖర్చులు కాకుండా కలుపుతీత, తెగుళ్ల నివారణకు పిచికారీ చేసే మందుల ఖర్చులే ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ అవుతున్నాయి. కత్తెరపురుగు నివారణకు మూడు, నాలుగు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకుంటే నష్టాలు తప్పవు.

– అద్దాలలక్ష్మీపతిరాజు, రైతు, సోమలింగాపురం గ్రామం, మెరకముడిదాం మండలం

అవగాహన కల్పిస్తున్నాం..



కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పంటను కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించిన వెంటనే లీటరు వేపనూనెను 200లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. అలాగే లీటరు నీటికి ఇమామెక్టిన్ బెంజోయెట్ 5 శాతం ఎస్‌జీ మందును మిల్లీ లీటరు కలిపి ఎకరానికి 80 గ్రాముల మందును పిచికారీ చేయాలి. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలి. – జి.శ్రావణితేజ, ఏఓ, మెరకముడిదాం మండలం